సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 16 । జూన్ । 2025



'ఓపెన్'గా చదివేద్దాం..
ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- 8లో



స్టూడెంట్ కిట్లు..
స్టూడెంట్ కిట్లు పూర్తిస్థాయిలో రాలేదు. టీచర్లు చేతులెత్తేస్తున్నారు.
- 8లో

19న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు
అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 19న జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశాలకు సంబంధిత కమిటీ సభ్యులు హాజరవుతారని, ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

పైడితల్లి అమ్మవారి పండుగలు ప్రారంభం



నృత్యాలు చేస్తున్న అభినయ నృత్య నికేతన్ బృందం

పొందూరు: మండలంలోని పొందూరు, కృష్ణాపురం, జోగన్నపేట, లక్ష్మీపేట, ఎరుకులపేట, అలబోయినపేట, ఎరుకుల కాలనీ గ్రామాల్లో పైడితల్లి అమ్మవారి పండుగలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. మూడు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అందుకున్న డాక్టర్ తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం శిష్య బృందం పొందూరు నెహ్రూ పార్కు ఆవరణలో నృత్య ప్రదర్శన చేసి అలరించింది.

రండి పరిగెడదాం..!



మాట్లాడుతున్న ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ఈ నెల 23న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఒలింపిక్ డే రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కోరారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా క్రీడలను చూడాలని కోరారు. ఈనెల 23వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించతలపెట్టిన ఒలింపిక్ డే రన్ నిర్వహణ కోసం విధివిధానాలు, ఏర్పాట్ల కోసం నగరంలోని డీఈఓ కార్యాలయానికి ఆనుకుని ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, సీఈఓ పి.సుందరరావు, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి తదితరులు మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద మొదలయ్యే ఒలింపిక్ డే రన్ ర్యాలీ కళింగ రోడ్, వైఎస్సార్ సర్కిల్, పాలకొండా రోడ్, కృష్ణాపార్క్, డేఅండ్‌నైట్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం వరకు కొనసాగుతుందన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



జస్టిస్ తుషార్‌రావుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ ప్రసాద్

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో చాలా మంది వ్యాపారులు తోపుడు బళ్లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇంతవరకు ఆలయం తరపున అధికారికంగా ఎలాంటి రుసుములు వసూళ్లు చేయనప్పటికీ దీనిపై ఆలయ ఈఓ ప్రసాద్ జోక్యం చేసుకుంటూ ఆదివారం ఒక్క రోజున ఒక్కో వ్యాపారాల బండి నుంచి రూ.500, మిగిలిన రోజుల్లో రూ.300 వరకు వసూలు చేసేలా చర్యలు మొదలుపెట్టారు. వ్యాపారులు ఈ తాజా పరిణామంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.5,24,200, పూజలు, విరాళాల ద్వారా రూ.1,08,120, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.05 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ప్రసాద్ ప్రకటించారు.

ఆదిత్యుని సన్నిధిలో జస్టిస్ తుషార్‌రావు
సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుషార్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈఓ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

నరసన్నపేట: దేవాది వద్ద కొనసాగుతున్న పేకాట శిబిరంపై నరసన్నపేట పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేసి పది మందిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.6890 నగదు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

చోరులు.. తీరులు



- జిల్లాలో పెచ్చుమీరుతున్న దొంగతనాలు
- దొంగతనాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి
- అరెస్టు కావడం.. బెయిల్‌పై బయటకు వచ్చి చోరీ చేయడం వీరికి పరిపాటి

కొందరు అర్ధరాత్రి చోరీ చేస్తారు.. ఇంకొందరు పట్టపగలే దోపిడీకి తెగబడతారు. కొందరు గొలుసులు ఎత్తుకుపోతారు.. మరికొందరు బైక్‌లపై కన్నేస్తారు. ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి. ఎన్నిసార్లు అరెస్టయినా.. ఎన్నిసార్లు కోర్టు మొట్టికాయలు వేసినా వీరి తీరు మారదు. జిల్లాలో దొంగలు పెచ్చుమీరిపోతున్నారు. ఇళ్లపై, వాహనాలపై, మనుషులపై దాడులు చేస్తూనే ఉన్నారు. పోలీసులు పట్టుకుంటున్నా చోరీలు ఆగడం లేదు. జిల్లాలో దాదాపు ఏడాది కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాల తీరు గురించి విశ్లేషించుకుంటే..

– శ్రీకాకుళం క్రైమ్



లారీల్లో వస్తారు.. కాజేసి పోతారు

140 చోరీలు.. 32 సార్లు అరెస్టు.. ముగ్గురూ డేంజరే
అరెస్టు : 15 ఏప్రిల్ 2025

ఉత్తరాఖాండ్ డెహ్రాడూన్‌కు చెందిన నూర్ హసన్ 140 ఇళ్లకు కన్నాలేసి, 32 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతడిపై జిల్లాలో 18 కేసులున్నాయి. డెహ్రాడూన్‌కే చెందిన షేర్‌మహ్మద్‌తో జైలులో పరిచయమై అతని 18 గ్యాంగులో సభ్యుడయ్యాడు. ఇటీవల కాశీబుగ్గ మూడు చోరీల్లో హసన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ రాయపూర్‌కు చెందిన ఇర్ఫాన్ అహ్మద్, అబ్దుల్ గఫూర్‌లకు పోలీసులు రిమాండ్ విధించారు. కందిపప్పు లోడు రాయపూర్ నుంచి కాశీబుగ్గకు తెచ్చి ఇక్కడి నుంచి సూర్య ట్రాన్స్‌పోర్టు కంపెనీ వద్ద జీడిపప్పుతో పాటు మార్గం మధ్యలో దొంగతనాలు చేసేవారు. చోరీ సొత్తును ఉత్తర ప్రదేశ్‌లో అమ్ముతారు.

జైలు శిక్ష పడినా..

ఒకరు 8 సార్లు జైలుకు.. మరొకరు 3 సార్లు జైలుకు
అరెస్టు : 3 ఏప్రిల్ 2025



పార్వతీపురం-మన్యం జిల్లా, సీతానగరం, జోగంపేటకు చెందిన పోలా భాస్కర్ శ్రీకాకుళం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో తొమ్మిది చోట్ల 17 చోరీలకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల మండలం ముద్దాడకు చెందిన ముద్దాడ నర్సింగరావుతో కలిసి ఈ చోరీలు చేశాడు. వీరిద్దరిదీ సెంట్రల్ జైలు పరిచయం. కాశీబుగ్గ పోలీసులు వీరిని పట్టుకుని 37 తులాల బంగారం, 21 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. భాస్కర్‌పై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో 37 చోరీ కేసులుండగా 8 సార్లు జైలు శిక్ష అనుభవించాడు. నర్సింగరావు మూడుసార్లు జైలు శిక్ష అనుభవించాడు.

గప్‌చుప్ దొంగలు

112 తులాలు కొట్టేసిన ఘనులు
అరెస్టు: 18 జనవరి 2025



విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన వున్నాన రాంబాబు, శ్రీకాకుళం జి.సిగడాంకు చెందిన గిడిజాల కోటేశ్వరరావుల చోరీ తీరు విభిన్నం. షూ ర్యాక్‌ల్లోను, ఎలక్ట్రికల్ మీటర్ రీడింగ్ బోర్డుపై, పూల కుండీల్లో, కిటికీ లోపల దాచిన తాళాలను తీసి సులువుగా ఇంట్లోకి చొరబడటం వీరి ప్రత్యేకత. ఇంటిలో ఎక్కడా ఏ వస్తువును టచ్ చేయకుండా.. ఫింగర్‌ప్రింట్స్ దొరక్కుండా జాగ్రత్త పడతారు. నాలుగైదు తులాలకు మించి దొంగతనం చేయరు. ఏడాది వ్యవధిలో 32 చోరీలకు పాల్పడి మొత్తం 112 తులాల బంగారాన్ని కాజేశారు. వీరిపై 30 కేసులున్నాయి. వీరిలో ఇంటర్ చదవిన రాంబాబుకు మొబైల్ అప్లికేషన్లు, హార్డ్‌వేర్ వంటి సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యముంది. మంచి క్రికెటర్ అయిన రాంబాబు రంజీ సెలెక్షన్లలో కోచ్ మోసం చేశాడన్న బాధతో దొంగతనాల వైపు మళ్లినట్టు సమాచారం.

వీరు పుస్తెల దొంగలు

32 కేసులు.. నిత్యం జైలు జీవితమే
అరెస్టు : 10 జనవరి 2025



ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా బరంపురానికి చెందిన సుజిత్‌కుమార్ పాడి, బాలకృష్ణ సాహు జిల్లాలోని నాలుగు చోట్ల చోరీలకు పాల్పడి ఏడున్నర తులాల బంగారంతో కొత్తూరు పోలీసులకు చిక్కారు. సుజిత్ గొడవల్లో జైలుకి వెళ్లి బాలకృష్ణకు పరిచయమయ్యాడు. బెయిల్‌పై విడుదలైన ఇద్దరూ మద్యం, పేకాట వ్యవసనాలకు బానిసై చోరీలకు నెట్టుకున్నారు. బైక్‌పై వెళ్తూ పుస్తెలు తెంపేసి పారిపోతారు. జిల్లాలో 2016 నుంచి 2024 వరకు 32 నేరాలుచేశారు. పశువులమేత మేపేవాళ్లు, పొలం చూడటానికి వెళ్లే ఒంటరి మహిళలే వీరి టార్గెట్.



ఎవరినీ వదిలేది లేదు
పర్లాఖిమిడి, పాతపట్నం, ఇచ్ఛాపురంలోనే కాక గొప్పిలిలో చెక్‌పోస్టు పెట్టాం. అంతర్రాష్ట్ర నేరగాళ్లపై బీట్‌సిస్టమ్, అనుమానితులపై సర్వేలెన్సు పెట్టాం. అంతర్రాష్ట్ర అధికారులతో అక్కడి నేరస్తుల ఫింగర్‌ప్రింట్ డీటైల్స్ కమ్యూనికేషన్ అయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

నిద్రిస్తున్న మహిళలే టార్గెట్

15 కేసుల్లో 57 తులాలు కొట్టేశారు
అరెస్టు : 30 నవంబరు 2024

ఒంటరి ఇళ్లల్లో నిద్రిస్తున్న మహిళల గొలుసులే లావేరు మండలం అదరపాకకు చెందిన పిన్నింటి సంతోష్, గట్టిమ ఆనంద్, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన రాగోలు రాంబాబుల టార్గెట్. లేదంటే తాళాలు వేసిన ఇళ్లల్లో చొరబడి బీరువాలు పగులగొట్టి చోరీ చేయడం, కుదరకపోతే ఏకంగా బీరువాలనే పొలాలకు మోసుకెళ్లి సొత్తును దాచేయడం వీరి నైజం. 2023 నుంచి జిల్లాలోని 15 చోరీల్లో 56.5 తులాల బంగారం, 44 తులాల వెండి కాజేశారు. జిల్లాలో పిన్నింటి సంతోష్‌పై 13 పాతకేసులు, రాంబాబుపై ఏడు కేసులున్నాయి.

దేవాలయాలను వదలరు..

43 చోరీల్లో నిందితులు
అరెస్టు : 01 అక్టోబరు 2024

మిల్లుల్లో చోరీ గిట్టుబాటు కాక దేవాలయాల్లో సొత్తు దోచుకునేందుకు భారీ పన్నాగం పన్నారు ఈ ముఠా. ఊరికి దూరంగా ఉండి.. ప్రజల ఉనికి లేని దేవాలయాల ప్రాంతాలను (సీసీ కెమెరాలు లేనివి) ఎంచుకుని కొన్ని రోజుల ముందు రెక్కీ చేసేవారు. 2021 నుంచి జిల్లాలోని 31 దేవాలయాలు, ఒక చర్చి, మూడు రైసుమిల్లులు, నాలుగు ఇళ్లల్లో చోరీ చేసి చివరకు జేఆర్‌పురం పోలీసులకు పట్టుబడ్డారు. నెల్లూరు లో ఉంటున్న హిరమండలం వాసి సవర సూర్యం ఆధ్వర్యంలోని తొమ్మిది మంది ప్రధాన నిందితులు. 43 చోరీల్లో వీరి హస్తముంది.

శివారు ఇళ్లు.. వృద్ధ మహిళలే టార్గెట్

కీలక నిందితుడు ఓ మాజీ సైనికుడు
అరెస్టు: 11 అక్టోబరు 2024

ఆర్మీలో టెక్నికల్ విభాగంలో పనిచేసి ఉద్యోగం మానేసిన ఓ వ్యక్తి దొంగతనాల బాటపట్టాడు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో అప్పుల పాలైన ఓ యువకుడు తన తండ్రితో కలసి మారుమూల ప్రాంతాల్లో ఉండే ఇళ్లను రెక్కీ చేస్తూ వృద్ధమహిళల మెడలే లక్ష్యంగా సీసీ కెమెరాల కంట పడకుండా 15 తులాల బంగారాన్ని కాజేశాడు. తండ్రీకొడుకులతో పాటు సహకరించిన మరో ఇద్దరు కటకటాలపాలయ్యారు. వారే మెళియాపుట్టి మండలం గొప్పిలికి చెందిన బసవ కిరణ్ కుమార్, బసవ రాజగోపాల్, బండారు ఉమామహేశ్వరరావు, మంత్రివలస సంధ్య. మూడు కేసుల్లో నిందితులైన వీరు కాశీబుగ్గ పోలీసులకు దొరికారు.

చైన్ స్నాచర్.. కేరాఫ్ కంచరపాలెం..

రాష్ట్రవ్యాప్తంగా 30 చోరీల్లో ప్రధాన నిందితుడు
అరెస్టు : 20 అక్టోబరు 2024



ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళలే లక్ష్యం.. పక్క నుంచే బైక్ పోనిచ్చి మెడలో చైన్‌లు తెంపేస్తాడు. విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన భీమరశెట్టి కమల్ నాథ్ తీరిది. 30 చోరీల్లో నిందితుడైన కమల్ పదిసార్లు జైలుకు వెళ్లాడు. ఏడో తరగతితో చదువు మానేసి తండ్రి మెకానిక్ షాపులో పనిచేస్తూ తాళాలు లేకుండా వాహనాలు తీయడం నేర్చుకున్న కమల్‌నాద్ 2009 నుంచి దొంగతనాలు చేస్తున్నాడు.

రాజస్థాన్ దొంగలు: రాజస్థాన్‌కు చెందిన ఆదిత్య పవార్ కుటుంబ సభ్యులు మూడేళ్లుగా దారి దోపిడీలు చేస్తున్నారు. జూన్ 6న అరెస్టయ్యారు. రాత్రిపూట లారీల్లో నిద్రిస్తున్న వారే వీరి టార్గెట్. ఈ గ్యాంగులో ఒక బాలుడు కూడా ఉన్నాడు.

దివ్యాంగుడే.. పథక రచనలో దిట్ట

ఆశ్రయమిచ్చి.. చోరీలు చేయించి..
అరెస్టు : 19 నవంబరు 2024

అనకాపల్లికి చెందిన మైలపల్లి అర్జునరావు దివ్యాంగుడు. కానీ బైక్, ఇతర చోరీల పథక రచనలో దిట్ట. పలాస అంబుసోలికి చెందిన జడ్యాడ సోమేశ్వరరావు, విజయనగరం జిల్లా సప్ప హరీష్, ఆమదాలవలస మదాసు ధనుష్‌లకు ఖర్చులకు డబ్బులిచ్చి ఉండటానికి గది అద్దెకిచ్చి రాత్రి పూట చోరీలు ఎలా చేయాలన్నది ప్రణాళిక వేసేవాడు. దొరికిన బైక్‌లను ఏపీలో అమ్మితే సమస్య అని ఒడిశా గజపతి జిల్లా మినిగాన్‌కుచెందిన దారపు శేషగిరి, ఏరుపల్లి బాలాజీల సాయంతో అమ్మేవాడు. చివరికి రూ. 15.5 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలతో ఆమదాలవలస పోలీసులకు పట్టుబడ్డారు.

33 నేరాల్లో 53 ట్రాన్స్‌ఫార్మర్లు..

రూ.1.53 కోట్ల కాపర్ చోరీ..
అరెస్టు: 10 నవంబరు 2024

జిల్లాలోని జె.ఆర్.పురం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, పొందూరు పీఎస్‌ల పరిధిలో 53 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసి 350 కిలోల రాగివైరు, 286 కిలోల రాగిదిమ్మలు, ఐదు కిలోల అల్యూమినియం వైర్లను దొంగిలించారు. ఎచ్చెర్ల అజ్జరాంకు చెందిన ఎలక్ట్రీషియన్ కుప్పిలి వరప్రసాద్ వ్యసనాలకు బానిసై గ్రామానికి చెందిన సాయితో కలసి ఆ పథకం పన్నాడు. వీరికి రామకృష్ణ గోవింద్, సత్యం జత కలిశారు. సాయి మేనమామ అసిరినాయుడు సహకరించారు. జె.ఆర్.పురం పోలీసులకు పట్టుబడ్డారు.



కాపర్ కేటుగాళ్లు వీరు..

అరెస్టు : 9 డిసెంబరు 2024

గారమండలం కొమరవానిపేటకు చెందిన కొమర తారకేశ్వరరావు, కదిరి హరీష్ (పెదగంట్యాడ, గంగవరం) గడ్డిపాటి తిలక్ (అభి- గాజువాక), చెన్ను చంటి (పెదగంట్యాడ)లతో కలసి మన జిల్లాలోని గార మండలం వత్సవలస ట్రిమాక్స్‌తో పాటు మరో రెండు చోట్ల, విజయనగరంలో ఒక చోట కాపర్ దొంగిలించారు. రూ. 26.34 లక్షల విలువైన 772 కిలోల కాపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2022 నుంచి చోరీకి పాల్పడుతున్న వీరు గతేడాది డిసెంబరులో అరెస్టయ్యారు.

ఆటోగ్యాంగ్: విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్టాడకు చెందిన గొర్లె మౌనిక, గొర్లె పెద్దింటమ్మ, మేకల హరిలు జూన్ 13న అరెస్టయ్యారు. వీరిపై పదికి పైగా కేసులు ఉన్నాయి. ఆటోలో వృద్ధులే వీరి టార్గెట్.

జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంక్షేమం నిల్.. అవాస్తవాలు ఫుల్

- కూటమిపై దుమ్మెత్తి పోసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వంలో సంక్షేమం నిల్.. అబద్ధాలు ఫుల్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. 'జగన్ అంటే నమ్మకం....చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పక్కనపెట్టేసి లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేసి ప్రజలకు నరకం చూపించడం సరికాదన్నారు. రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన చేశామని, చంద్రబాబు వచ్చాక కూటమి నాయకులు దోచుకో దాచుకో అన్న చందంగా పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేశామని గుర్తు చేశారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా నేటికి రైతులకు రుణాలు లేవని, విత్తనాలు రాలేదని, రైతుభరోసా కేంద్రాలు తలుపులు తీసేవారే లేరని అన్నారు. నాడు-నేడుతో స్కూళ్లను బాగు చేసి పేదలకు ఇంగ్లిష్ మీడియం అందించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. అభివృద్ధి ఒక్క చోట ఆగిపోకూడదనే వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారని, కానీ చంద్రబాబు దానిపై లేనిపోని దుష్ప్రచారాలకు ఒడిగట్టారని విమర్శించారు.

మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు కూటమి పాలనలో ఎక్కువైపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తే, కూటమి పాలనలో తెలుగు తమ్ముళ్లకు మాత్రమే పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఈ తేడాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కూడా ఈ విషయాలను వివరించాలన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎచ్చెర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పార్టీ కాళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, ఆమదావలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గేదెల పురుషోత్తం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, డీసీసీబీ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు కరిమి రాజేశ్వరరావు, గొండు కృష్ణమూర్తి, తంగుడు నాగేశ్వరరావు, చల్ల రవి, చంద్రభూషణ్ గుప్తా, ఆరంగి మురళి, రాజాపు అప్పన్న, చింతు రాము, మన్మధ పాల్గొన్నారు.

మేజర్ రామ్‌గోపాల్‌నాయుడుకు సత్కారం



మేజర్ గోపాల్‌నాయుడును సత్కరిస్తున్న మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తి చక్ర అవార్డు స్వీకరించి తొలిసారి జిల్లాకు విచ్చేసిన సంతబొమ్మాళి మండలం నగరిపెంట గ్రామానికి చెందిన మేజర్ మల్ల రామ్‌గోపాల్‌నాయుడును జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లివీధిలో ఉన్న జిల్లా మాజీ సైనికుల కమ్యూనిటీ హాలులో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మేజర్ నాయుడు తన జట్టును చాకచక్యంగా ముందుకు నడిపించి ఉగ్రవాదులను మట్టికరిపించారని పేర్కొన్నారు. అనంతరం నాయుడు మాట్లాడుతూ యువత దేశభక్తి అలవర్చుకున్ననాడే మనం సరికొత్త భారతావనిని చూడగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల ఫెడరేషన్ చైర్మన్ పి.ఈశ్వరరావు, మెండ నారాయణరావు, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇసుక దందా



బైదలాపురం-రుగడ మీదుగా ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు

పాతపట్నం: ఒడిశాకు ఇసుక యథేచ్ఛగా తరలి వెళ్లిపోతోంది. అక్రమార్కులు పట్టపగలే ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆంధ్రా నుంచి ఒడిశాకు పట్టపగలే ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమంగా పాతపట్నం, బైదలాపురం మీదుగా పర్లాకిమిడి(ఒడిశా)లోకి తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గడంతో పాటు అవినీతికి పాల్పడుతూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం టాక్టర్ల ద్వారా ప్రతి రోజు తెల్లవారు జామున 4 గంటల నుంచి రాత్రి 8 గంటల అక్రమంగా తరలిస్తున్నారు. హిరమండలం మండలం భగీరథపురం, రుగడ, కొత్తూరు మండలం నివగాం, పొట్నూరు వంశధారలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒడిశాలో ఇసుక ట్రాక్టర్ రూ. 4 నుంచి రూ.4,500 వేలు పలుకుతోంది. ఆంధ్రాలో ఇసుక ట్రాక్టర్ (పాతపట్నం)రూ.1,500 నుంచి రూ.2 వేలు ఉంది. పాతపట్నం జాతీయ రహదారి మీదుగా సరిహద్దు చెక్‌పోస్ట్ మీదుగా, రుగడ, బైదలాపురం మీదుగా పర్లాకిమిడిలోకి ఇసుక అక్రమంగా వెళ్తోంది. ఇప్పటికైనా మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు



కోళ్లఫారంలో నాగుపాము

నాగుపాము కలకలం

ఎల్.ఎన్.పేట: కోవిలాం వద్ద ఓ కోళ్ల ఫారంలో నాగుపాము కలకలం సృష్టించింది. ఆదివారం ఫారంలోకి నాగు పాము ప్రవేశించటంతో యజమాని గమనించారు. పెద్దగా పడగ విప్పడంతో భయాందోళనకు గురై బయటకు వచ్చేశారు. అనంతరం ఎల్.ఎన్.పేట సెంటర్‌కు చెందిన స్నేక్‌క్యాచర్ ముయ్యిరాజుకు సమాచారం ఇవ్వటంతో ఆయన చాకచక్యంగా నాగుపామును పట్టుకుని దూరంగా తీసుకెళ్లి విడిచిపెట్టారు.

క్లుప్తంగా

సర్పంచ్‌ల పిల్లలకు తల్లికి వందనం ఎందుకివ్వరు?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నవతల సర్పంచ్ శ్రీహరిని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

పాతపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామ సర్పంచ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా భావిస్తున్నారా..? వారి పిల్లలకు తల్లికి వందనం ఇవ్వకపోవడానికి కారణమేంటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రశ్నించారు. పాతపట్నంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లకు గౌరవ వేతనంగా ప్రభుత్వం కేవలం రూ.3వేలు అందజేస్తుందని, ఆ మాత్రం దానికి ఏకంగా తల్లికి వందనం వంటి పథకాలు నిలిపివేస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలకు దగ్గరై కార్యక్రమాలు చేపట్టినంత మాత్రాన సర్పంచ్‌లు ధనికులో, ఉద్యోగులో కారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో జరిగితన గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నిక కావడమే దీనికి కారణంగా భావిస్తున్నామని, ఇది కక్షపూరిత చర్య అని చెప్పారు. గ్రామ పంచాయతీలకు నేరుగా చెల్లించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి మళ్లించిందని ఆరోపించారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడాన్ని తప్పు పడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం గెలిచిందన్నారు. అంతకు ముందు పాతపట్నం ఎగువ కంద్రవీధిలో ఉంటున్న నవతల సర్పంచ్ పల్లి శ్రీహరిను కృష్ణదాస్ పరామర్శించారు. శ్రీహరి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యరుకోల వెంకటరమణ, వరుదు దేవిప్రసాద్, బొంగు కొండయ్య, ఎల శ్యామ్, గల్లంగి వెంకటరావు, కొండాల బాబురావు, ప్రశాంత్, కాళ్ల సింహాచలం, పల్లి క్రిష్ణ, యడ్ల రంగారావులు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసీలకు ప్రత్యేక నియోజకవర్గాలు

- భీమ్ సేన ఉత్తరాంధ్ర యువ సమ్మేళనంలో వక్తలు డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భీమ్‌సేన బృందం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళిత, ఆదివాసీలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటుచేయాలని భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి సిద్ధార్థ డిమాండ్ చేశారు. భీమ్ సేన ఉత్తరాంధ్ర యువ సమ్మేళనం మూడో సదస్సు శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు, ఆదివాసీలకు ప్రత్యేక నియోజకవర్గాలు లేకపోవడం వల్లే అసెంబ్లీ, పార్లమెంటులో హక్కుల కోసం పోరాటం చేసే అవకాశం దక్కడం లేదన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులంతా దళిత, ఆదివాసీలకు ప్రత్యేక నియోజకవర్గాల కోసం తగిన కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, డాక్టర్ అంబేడ్కర్, నగిరి మోహన్‌రావు, డాక్టర్ కంత వేణు, బడియా కామరాజు, డి.గణేష్, బోయిడి మురళీకృష్ణ, బోనెల రమేష్, బత్తిన మోహన్‌రావు, లింగాల అప్పన్న, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్



చేపేనపేటలో క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న డీపీఎం పూజారి సత్యనారాయణ తదితరులు

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పంట ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉందని అలాగే వాటికి మార్కెట్‌లో అధిక ధర కూడా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో క్షేత్ర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం పర్యటించారు. డీపీఎం మాట్లాడుతూ రైతులు విత్తనం నాటిన నుంచి మళ్లీ కోత వరకు ఎలాంటి రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించే రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తమ సిబ్బంది ద్వారా విక్రయించి ప్రోత్సహిస్తామన్నారు.

ఓపెన్‌గా చదివేద్దాం!

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- వయస్సుతో నిమిత్తం లేకుండా చదువుకునేందుకు అవకాశం
- టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- దరఖాస్తులకు తుది గడువు జూలై 30



ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)



తరగతుల్లో ఉన్న విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ :

చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారీ స్కూల్/కాలేజీకి వెళ్లలేక.. ఇలా కారణమేదైనా విద్యకు దూరమైన వారికి బాసటగా నిలుస్తోంది ఓపెన్ స్కూల్. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నామమాత్రపు ఫీజుతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) దూరవిద్యను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పకడ్బందీగా అందించింది. ప్రస్తుతం అవే ఫీజులు, నిబంధనలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోంది. రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమైన ఈ విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

చదువుకు దూరమైన వారికి..

ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అండగా నిలుస్తోంది. రెగ్యులర్‌గా పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన వారు, వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, బాలికలు, గృహిణులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, దిగువ స్థాయి ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా చేరవచ్చు. గతంలో ఈ దూర విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు. రెండేళ్ల ఇంటర్ విద్య అయినా, పదో తరగతైనా ఏడాదిలోనే పూర్తి చేసుకోవచ్చు.



ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్

ప్రవేశాలకు వేళాయె..

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తులు ప్రక్రియ మొదలైంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ స్టడీ సెంటర్ దగ్గర వద్ద గానీ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో జూలై 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.200 ఆలస్య అపరాధ రుసుంతో ఆగస్టు 15 వరకు చెల్లించేందుకు గడువు ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. 15 ఏళ్లు పూర్తయి పదో తరగతి పాసైనవారు, ఇంటర్ మధ్యలో ఆపేసినవారు/ఫెయిలైనవారు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానం..

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందో లేదోననే అపోహ చాలా మందిలో ఉంది. అయితే అది పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ ఉన్నతాధికారులే చెబుతున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. వీటితో ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని విద్యాశాఖాధికారులు, యూనివర్సిటీ అధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఓపెన్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాస్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు నేరుగా అభ్యర్థుల చిరునామాకే పంపించేలా గత ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంది.

బాలికా విద్యకు ప్రోత్సాహం..

బాలికా విద్యను ప్రోత్సహించేలా ఓపెన్ స్కూల్ సొసైటీ అనేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక కారణాలు, సమీపంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో లేక వేలాది మంది బాలికలు, గృహిణులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అలాంటి వారు చదువుకునేందుకు ప్రభుత్వం ఫీజులో రాయితీ కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. వీరితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు, మాజీ సైనికుల పిల్లలకు కూడా ప్రవేశ రుసుం ఫీజులో రాయితీ కల్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఎస్ఎస్‌సీకి 45 స్టడీ సెంటర్లు, ఇంటర్మీడియెట్‌కు 30 స్టడీ సెంటర్లు ఉన్నాయి. ప్రతి మండలంలో దాదాపుగా అధ్యయన కేంద్రాలు ఉన్నాయి.
- ఆసక్తి గల వారికి ప్రవేశాలు కల్పించి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తారు.
- ఎంచుకున్న మీడియం ప్రకారం పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ అందజేస్తారు.
- అడ్మిషన్ పొందిన వారు 30 తరగతులకు కచ్చితంగా హాజరు కావాలి. అలాగైతేనే పరీక్ష రాసేందుకు అర్హత కల్పిస్తారు.
- అడ్మిషన్ పొందిన వారికి ఉత్తీర్ణత సాధించేందుకు ఐదేళ్ల వరకు అవకాశం ఇస్తారు.
- టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలనుకునే వారు తెలుగు, ఇంగ్లీషుతోపాటు ఇతర మీడియంలో కూడా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- ఇంటర్‌లో సైన్స్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ ఇతరత్ర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.
- ఓపెన్ స్కూల్ సొసైటీ ముఖ్యమైన సమాచారం తెలియజేసేందుకు, పాఠాల కోసం 'జ్ఞానధార' పేరిట ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌ను గత ప్రభుత్వం ప్రారంభించింది.

దరఖాస్తు చేసుకోవాలి..



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. జూలై 30 వరకు గడువు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. అంగన్‌వాడీలు, గ్రామ సచివాలయం సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– లియాకత్ అలీఖాన్, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్

రెగ్యులర్ విద్యతో సమానం



వివిధ కారణాలతో చదువు మధ్యలో చదువు ఆపేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిది. టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి మంచి సదావకాశం. దిగువశ్రేణి ఉద్యోగులు, గృహిణిలు, వ్యాపారులు, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశా కార్యకర్తలకు ఉపయుక్తమైంది. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం

వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- మహిళను బైక్‌తో ఢీకొట్టడంతో ప్రమాదం
- మృతుల్లో ఇచ్ఛాపురం హెడ్ కానిస్టేబుల్

టెక్కలి రూరల్/ఇచ్ఛాపురం రూరల్/సోంపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. టెక్కలి మండలం ఒలేసాగరం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన పాత్ర రవీంద్ర నాయకో కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం అర్ధరాత్రి టెక్కలి మండలం ఒలేసాగరం సమీపంలో జాతీయ రహదారిపై బస్సుదిగారు. ముందుగా భార్యాపిల్లలను రోడ్డు దాటించారు. అనంతరం తల్లి సుభద్రా నాయకో(58)ను రోడ్డు దాటిస్తుండగా ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పొట్టి జగదీశ్వరరావు(45) ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టారు. ఈ ఘటనలో సుభద్రా నాయకోతో పాటు జగదీశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గాయపడిన వారిని టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జగదీశ్వరరావు (ఫైల్)

శిక్షణ కోసం వెళ్తూ..

కాగా, హెడ్ కానిస్టేబుల్ జగదీశ్వరరావు మృతితో విషాదఛాయలు అలముకున్నాయి. ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయన విజయనగరంలో శిక్షణ ఉండటంతో శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. స్వగ్రామం సోంపేట మండలం ఎర్రముక్కాం. భార్య పుష్ప, ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడు సాయి ఉన్నారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు తెలిపారు. జగదీశ్వరరావు మృతి పట్ల సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ. ఈ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అక్రమ అరెస్టులతో సంక్షేమానికి తూట్లు



కంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కన పెట్టి అక్రమ అరెస్టులతో ప్రజానీకం దృష్టి మరల్చుతున్నారని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ హామీలు నెరవేర్చకుండా కప్పదాటు ధోరణి అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. తాజాగా తల్లికి వందనం పథకంలో ప్రతి తల్లికి రూ.2వేలు కోతపెట్టి రూ.13వేలు మాత్రమే తల్లుల ఖాతాల్లో జమ చేయడం తగదన్నారు. పూర్తిగా రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడెక్కడున్నారని ప్రశ్నించారు. ప్రజానీకం దృష్టి మరల్చడానికే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేయించారని, ఈ విషయంలో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడం చూస్తే కూటమి ప్రభుత్వంలో ఎంత అన్యాయం జరుగుతుందో ప్రజలకు అర్థం అవుతోందన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా జర్నలిస్టులపై కేసులు పెట్టడం, సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు.

కిమ్స్‌లో అత్యాధునిక వైద్యసేవలు

అరసవల్లి: జిల్లాలో కిమ్స్ ఆసుపత్రితోనే కార్పొరేట్ వైద్యం పరిచయమయ్యిందని..ఇప్పుడు అదనపు బ్లాక్ ద్వారా మరింత ఆధునిక సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆసుపత్రి నూతన బ్లాక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు అందించేలా ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ పనిచేస్తుందని..రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ఏమాత్రం తగ్గిపోకుండా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, కిమ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, శీనయ్య, కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డాక్టర్ రవిసంతోష్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ వేద తదితరులు పాల్గొన్నారు.



కిమ్స్‌లో నూతన బ్లాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. పక్కనే కిమ్స్ వ్యవస్థాపకులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఆదివారం గ్రాడ్యుయేషన్ (జెనిత్స్–2020)డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెమ్స్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు బీఎస్సీ పారామెడికల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. పదేళ్లలో బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా పది వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో వారంతా ఉద్యోగంలో రాణిస్తున్నట్లు తెలిపారు. బీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని శీనయ్య మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెమ్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధీర్ మాట్లాడుతూ వైద్య రంగంలో పారామెడికల్ టెక్నీషియన్స్ కీలక పాత్ర పోషిస్తారన్నారు. జెమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వపడేలా పిల్లలు నడుచుకోవాలన్నారు. జెమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ లలిత మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఇప్పటివరకూ పదివేల మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీపద్మజ, జెమ్స్ సీఈఓలు ఆద్విక్, రామ్మోహన్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బొల్లినేని భాస్కరరావు

స్టూడెంట్ కిట్టు.. పూర్తిగా వస్తే ఒట్టు!

- బూట్లు, యూనిఫాం రాకపోవడంతో చాలాచోట్ల నిలిచిన పంపిణీ
- అరకొర వస్తువులు రావడంతో చేతులెత్తేస్తున్న ఉపాధ్యాయులు
- కొన్నిచోట్ల ప్రజాప్రతినిధుల సమక్షంలో హడావుడిగా పంపిణీ
- ప్రశ్నిస్తారనే భయంతో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జూలై 5కి వాయిదా!

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే తప్ప.. చేసిందేమి లేదన్న విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు గుర్తిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బడులు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు అందజేసేవారు. గత ఏడాది మాత్రం.. అప్పటికే జగన్ ప్రభుత్వం ఇండెంట్ ప్రకారం సమకూర్చిన విద్యాకానుక(విద్యార్థి మిత్రగా పేరు మార్చి పంపిణీ చేశారు.)ను మొదటి రెండు రోజుల్లో పంపిణీ పూర్తిచేశారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట స్టూడెంట్ కిట్‌ను అందజేయడంలో ఘోరంగా విఫలమైంది. పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బ్యాగులు, యూనిఫాం ఇలా ఏ వస్తువులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో కిట్లను అందజేయలేక ఉపాధ్యాయులు చేతులెత్తేస్తున్నారు. దీంతో విద్యార్థులకు పంపిణీ చేయకుండా బాక్సుల్లోనే ఉంచేస్తున్నారు. అక్కడక్కడ ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ఒకటి రెండు వస్తువులతో పంపిణీచేసి 'కిట్లు అందజేసేశాం' అని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొన్ని చోట్ల వచ్చిన కొన్ని వస్తువులనే పంపిణీ చేద్దామంటే.. ప్రజాప్రతినిధులు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం లేదని ఉపాధ్యాయులే చెబుతున్నారు. విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ ఐటమ్స్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు తర్వాత అత్యంత కీలకమైనవి బూట్లు, బెల్టులు. జిల్లాలో 30 మండలాలు ఉండగా నేటికి 10 మండలాలకు బూట్లు, యూనిఫాం చేరలేదు.



శ్రీకాకుళంలోని ఓ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో బాక్సులకే పరిమితమైన నోట్‌బుక్స్

పేరెంట్స్ మీటింగ్ వాయిదా..

సర్కారీ బడుల్లో పేరెంట్స్ మీటింగ్ తల్లిదండ్రులతో బడులు పునఃప్రారంభమైన మొదటివారంలోనే నిర్వహించాల్సి ఉంది. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వాయిదా వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తాజాగా తల్లికి వందనం పథకం పథకాన్ని సవాలక్ష ఆంక్షల నడుమ వేలాది మంది అర్హులను.. అనర్హులుగా మార్చేశారు. ఇంకా చాలా మందికి నగదు జమకాలేదు. మరోవైపు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు రాలేదు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత క్షీణించింది. వీటన్నింటిని తల్లిదండ్రులు పశ్నిస్తారనే భయంతో ఇప్పుడు సమావేశం నిర్వహించకుండా జూలై 5వ తేదీ నాటికి పేరెంట్ టీచర్ మీటింగ్ వాయిదా వేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులు తగ్గారు.. బడ్జెట్ పెరిగింది..

కూటమి ప్రభుత్వంలో ముఖ్యంగా విద్యాశాఖలో అవకతవకలు తీవ్ర చర్చనీయాంశమౌతున్నాయి. గతంలో 46 లక్షల మంది విద్యార్థులకు మన్నిక, నాణ్యమైన విద్యా సామగ్రితో కూడిన జగనన్న విద్యాకానుక కోసం రూ.650 కోట్ల మేర బడ్జెట్ వెచ్చించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రస్తుత విద్యా సంవత్సరంలో 40లక్షల మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కోసం దాదాపు రూ.వెయ్యి కోట్లకు బడ్జెట్ పెంచారు. 6లక్షల మంది విద్యార్థులు తగ్గితే రూ.350 కోట్ల బడ్జెట్ పెంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శ్రీకాకుళంలోని ఓ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పంపిణీకాని స్టూడెంట్ కిట్లు

వారికి నో యూనిఫాం.

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి మార్చిన కొత్త యూనిఫాంను ఇంటర్ విద్యార్థులకు ఇవ్వడం లేదు. ఇప్పటికే మాజీ సీఎం జగన్ సమకూర్చిన పాత యూనిఫాం ఎక్కడా కనిపించడానికి వీల్లేదని అధికారులకు హుకుం జారీ చేశారు. తాజాగా మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులు పాత యూనిఫాం ధరించాలని ప్రభుత్వమే నిర్ణయించిందని విద్యాశాఖ అధికారులు చెబుతుండటం కొసమెరుపు.

మోసం కేసులో వ్యాపారికి జైలుశిక్ష

ఇచ్ఛాపురం : పట్టణానికి చెందిన పెయింటింగ్ వ్యాపారి కాళ్ల శ్రీనివాసరావు 2017లో నకిలీ ఏషియన్ పెయింట్స్ తయారు చేసి అమ్ముతుండగా పట్టుబడటంతో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిందితునికి రెండున్నరేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించిందని పట్టణ ఎస్సై ముకుందరావు ఆదివారం తెలియజేశారు.

గొల్లగండి తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సోంపేట: గొల్లగండి సముద్రతీరానికి ఆదివాయం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం చేరింది. స్థానికులు గమనించి బారువ పోలీసులకు సమాచారం తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. బారువ ఏఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

జిల్లాలో టీచర్ల బదిలీలు పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సాధారణ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. అన్ని కేటగిరిల్లో మొత్తం 6392 మంది ఉపాధ్యాయుల దరఖాస్తు చేసుకోగా 3546 మంది బదిలీ అయ్యారు. వీరిలో అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు 1967 మంది ఉన్నారు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఇప్పటికే విధుల్లో చేరిపోగా.. తాజాగా ముగిసిన ఎస్టీటీల బదిలీలతో రెండు మూడు రోజుల్లో వీరంతా వారు ఎంపికచేసుకున్న స్థానాల్లో చేరనున్నారు. జిల్లాలో 124 మంది ఎస్ఏలు, ఎస్టీటీలు పదోన్నతులు పొందినట్టు డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య ధృవీకరించారు. మరోవైపు, కూటమి ప్రభుతం అస్పష్టత విధానాలు వల్ల నష్టపోయామని పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు.